

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

- మరొకరికి గాయాలు
- ఉద్దండపురం వద్ద హైవేపై ఘటన

..వార్త 7వ పేజీలో


ఆవాల నవీన్ (ఫైల్)


కిల్లాడ నాగేశ్వరరావు (ఫైల్ ఫొటో)

మళ్లీ వాన!

అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షం

- జిల్లా సగటు 45.9 మిల్లీమీటర్లుగా నమోదు
- అత్యధికంగా కశింకోటలో 159.2 మి.మీ.ల వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- రిజర్వాయర్లకు వరద.. గేట్లు ఎత్తివేత
- నదుల్లో పెరిగిన వరద ఉధృతి





పరవాడ పెద్ద చెరువు పొర్లుగట్టు పైనుంచి ఉధృతంగా పారుతున్న వర్షం నీరు (ఇన్‌సెట్‌లో) గండి పడిన పెద్ద చెరువు బంధగట్టు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం పడగా, బుధవారం ఉదయం నుంచి ముసురు వాతావరణం నెలకొంది. కొన్నిచోట్ల మోస్తరు నుంచి తేలికపాటి జల్లులు కురిశాయి. రానున్న 24 గంటల్లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.

45.9 మిల్లీమీటర్ల వర్షం

జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో జన జీవనానికి అంతరాయం కలిగింది. పలు రోడ్లపై వర్షం నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అసౌకర్యం కలిగింది. మంగళవారం రాత్రి ఎనిమిది గంటల నుంచి బుధవారం ఉదయం ఎనిమిది గంటల వరకు జిల్లాలో 45.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కశింకోట మండలంలో 159.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పరవాడలో 126 మి.మీ.లు, గొలుగొండ 120.2, మునగపాకలో 108.8, దేవరాపల్లిలో 102.6, నర్సీపట్నంలో 80.4, అనకాపల్లిలో 60.8, పాయకరావుపేటలో 50.8, రోలుగుంటలో 49.4, రావికమతంలో 42.8, నాతవరంలో 38.4, నక్కపల్లిలో 21.8, బుచ్చెయ్యపేటలో 20.4, చోడవరంలో 20, అచ్యుతాపురంలో 14.2, కె.కోటపాడులో 13.8, చీడికాడలో 13.4, రాంబిల్లిలో 11.2, కోటవురట్లలో 10.8, ఎలమంచిలిలో 9.8, ఎస్.రాయవరంలో 9.2, మాకవరపాలెంలో 8.6, మాడుగుల మండలంలో 3.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కాగా అనకాపల్లి పట్టణంలో భారీ వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గుండాల వీధి రైల్వే వంతెన కింద, తుమ్మపాల వెళ్లే ప్రధాన రహదారిపై వర్షం నీరు చేరడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. కొప్పాక సమీపంలో జాతీయ రహదారిపైకి ఏలేరు కాలువ నీరు రావడంతో బుధవారం ఉదయం కొద్దిసేపు వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. వాహనాల రాకపోకలను ఒకే మార్గంలోకి మళ్లించాల్సి వచ్చింది.

కాగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతోపాటు కల్యాణపులోవ జలాశయం గేట్లు ఎత్తడంతో కోటవురట్ల మండలంలో వరహా, సర్పా నదుల్లో వరద ప్రవాహం పెరిగింది. అదే విధంగా పాయకరావుపేట మండలంలో తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తున్నది.


కొత్తూరు పంచాయతీ శారదానగర్‌లో నీట మునిగిన సాయినగర్ వీధి

పరవాడలో కుండపోత

- పెద్ద చెరువు గట్టుకు గండి

పరవాడ, సెప్టెంబరు 25: పరవాడలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. నాలుగు గంటలపాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు, కాలనీలు నీటమునిగాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 12.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు వ్యవసాయాధికారి చంద్రావతి తెలిపారు. ఎగువ నుంచి భారీగా వరద నీరు రావడంతో పరవాడ పెద్ద చెరువు బంధగట్టుకు గండి పడింది. మండల కేంద్రంలోని బొంకులదిబ్బవీధి ప్రాంతమంతా చెరువును తలపించింది. దీంతో దిగువన ఉన్న ఎస్సీ కాలనీ నీట మునిగింది. స్థానికులు రాత్రంతా తీవ్ర అవస్థలు పడ్డారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందాం

ఉమ్మడి జిల్లా కూటమి ప్రజా ప్రతినిధులతో మంత్రి నారా లోకేశ్ భేటీ

- స్టీల్‌ప్లాంటు అంశంపైనే ప్రధానంగా చర్చ
- సెయిల్‌లో విలీనం చేస్తే బాగుంటుందన్న కొందరు ఎమ్మెల్యేలు
- కేంద్రంతో వీలైనంత త్వరగా చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరిన పలువురు నేతలు
- కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ప్రశ్నే ఉత్పన్నం కాదన్న యువనేత
- కార్మికుల కళ్లలో ఆనందం చూడాలనే దృఢ సంకల్పంతో కేంద్రంతో సంప్రతింపులు జరుపుతున్నట్టు వెల్లడి


రుషికొండలోని రాడిసిన్ బ్లూ హోటల్‌లో బుధవారం సాయంత్రం ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజాప్రతినిధులతో సమావేశమైన మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందామంటూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన కూటమి ప్రజా ప్రతినిధులు తీర్మానించారు. కర్మాగారానికి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. బుధవారం సాయంత్రం రుషికొండలోని రాడిసిన్ బ్లూ హోటల్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన కూటమి ప్రజా ప్రతినిధులతో రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా విశాఖ ఉక్కు కర్మాగారం అంశంపైనే చర్చ జరిగింది. అందరూ తమ తమ అభిప్రాయాలు వ్యక్తపరచారు. ప్రస్తుతం కర్మాగారంలో ఒక్కొక్క యూనిట్‌ను మూసివేస్తున్నారని, ఉద్యోగులను డిప్యుటేషన్‌పై బయటకు పంపుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇటువంటి పరిస్థితుల్లో కర్మాగారాన్ని కాపాడుకునేందుకు కేంద్రంతో చర్చించాలని కోరారు. ఇప్పుడున్న సంక్షోభం నుంచి బయటపడి కర్మాగారం సజావుగా నడవాలంటే ఉక్కు దిగ్గజం సెయిల్‌లో విలీనం చేయడం ఒక్కటే మార్గమని కొందరు అభిప్రాయపడ్డారు. 32 మంది బలిదానంతో ఏర్పడిన కర్మాగారం ఆంధ్రుల సెంటిమెంట్‌కు సంబంధించిందని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ స్టీల్‌ప్లాంటును కాపాడుకోవాలని ఉద్దేశంతో ఉన్నారన్నారు.

సెయిల్‌తో సంబంధం లేకుండా కేంద్రం నుంచి భారీగా రుణం తీసుకుని కర్మాగారాన్ని నడిపితే ఎలా ఉంటుందని కొందరు ప్రస్తావించగా మరికొందరు పలు సందేహాలు వ్యక్తంచేశారు. కేంద్రం ఇచ్చిన నిధులతో సజావుగా ప్లాంటు నడిపితే ఫర్వాలేదని...రెండు, మూడేళ్ల తరువాత నిధుల సమస్య మళ్లీ మొదటకు వస్తే అప్పుడు పరిస్థితి ఏమిటని ... మిగతా 8వ పేజీలో

నేడు అప్పన్నను దర్శించుకోనున్న లోకేశ్

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ గురువారం ఉదయం ఆరున్నర గంటలకు సింహాచలం వరాహ నరసింహస్వామి దేవాలయానికి వెళ్లి స్వామిని దర్శించుకుంటారు. ఆ తరువాత ఉదయం తొమ్మిది గంటల నుంచి పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలను కలుసుకుంటారు. వీలును బట్టి కార్యకర్తలతో సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. తరువాత నగరంలో మునిసిపల్ పాఠశాలలను సందర్శిస్తారు. అయితే దీనికి సంబంధించి ఎటువంటి సమాచారం బయటకు చెప్పలేదు. జిల్లా విద్యాశాఖకు కూడా సమాచారం ఇవ్వలేదు. నగరంలో పాఠశాలల వివరాలు ఇప్పటికే సేకరించిన లోకేశ్, ఆకస్మికంగా ఒకటి, రెండు పాఠశాలలను సందర్శించవచ్చునంటున్నారు.

జిల్లా ఎస్పీగా తుహిన్ సిన్హా

కాకినాడ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా దీపిక బదిలీ


తుహిన్ సిన్హా


ఎం.దీపిక

అనకాపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా తుహిన్ సిన్హాను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన తుహిన్ సిన్హా విశాఖపట్నం నగర పోలీస్ కమిషనరేట్‌లో శాంతి భద్రతల డీసీపీగా పని చేస్తున్నారు. ఆయనకు అనకాపల్లి ఎస్పీగా స్థానచలనం కలిగింది. అంతకుముందు ఆయన ఏఎస్ఆర్ జిల్లా ఏస్పీగా పనిచేశారు. కాగా ఇప్పటి వరకు అనకాపల్లి జిల్లా ఎస్పీగా వున్న ఎం.దీపికను కాకినాడ ఏపీఎస్‌పీ మూడో బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేశారు. ఆమె విజయనగరం ఎస్పీగా పనిచేస్తూ ఈ ఏడాది జూలై 17న అనకాపల్లి జిల్లా ఎస్పీగా బదిలీపై వచ్చారు.

గొలగాంలో భూదందా

ప్రభుత్వం మారినా... ఆగని భూ ఆక్రమణలు

- సర్వే నంబరు 283లో 1.5 ఎకరాలు కబ్జా
- 50 సెంట్ల చొప్పున పంచుకున్న ముగ్గురు నేతలు
- చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణం


(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ జిల్లాలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు ఆగడం లేదు. స్థానిక నాయకులు ప్రభుత్వ భూములను గుర్తించి మరీ తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. కలెక్టరేట్ కార్యాలయానికి కూత వేటు దూరంలో అనకాపల్లి మండలం గొలగాం పంచాయతీలో కోటిన్నర రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని మూడు పార్టీలకు చెందిన ముగ్గురు నేతలు కబ్జా చేశారు. చుట్టూ ప్రహరీగోడ నిర్మించి, పలు రకాల ఉద్యాన పంటల మొక్కలు వేశారు.


గొలగాం నుంచి గోపాలపురం వెళ్లే దారిలో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం


గొలగాంలో ఎల్లారమ్మ కాలనీ వద్ద ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నాటిన కొబ్బరి, మామిడి మొక్కలు

అనకాపల్లి మండలం గొలగాం గ్రామంలో 283 సర్వే నంబరులో 50 ఎకరాలకు పైగా ప్రభుత్వ కొండపోరంబోకు భూమి ఉంది. ఇక్కడ ప్రస్తుతం ఎకరా రూ.కోటి వరకు పలుకుతున్నది. ఇక్కడ ప్రభుత్వ భూమిపై కన్నేసిన కూటమి పార్టీల నాయకులు ఎల్లారమ్మ కాలనీలో సుమారు ఒక ఎకరా 50 సెంట్ల స్థలంలో పాగా వేశారు. ఒక్కొక్కరు 50 సెంట్లు చొప్పున హద్దులు వేసుకొని చుట్టూ గోడ నిర్మించారు. ఆక్రమిత స్థలంలో కొబ్బరి, మామిడి మొక్కలు నాటించారు. మార్కెట్ ధర ప్రకారం కబ్జాకు గురైన భూమి విలువ రూ.1.5 కోట్లు ఉంటుంది. దీంతోపాటు గొలగాంలో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఆనుకొని గోపాలపురం వెళ్లే దారిలో సర్వే నంబరు 88లో సుమారు నాలుగు సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఒక వ్యక్తి ఆక్రమించాడు. అక్కడ ఉన్న తాగునీటి బోరును తొలగించి మరీ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించకూడదని, ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టకూడదని నిబంధనలు వున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు చేపట్టాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న బత్తుల తాతయ్యబాబు


సీఎం చంద్రబాబునాయుడుకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న పీలా గోవింద సత్యనారాయణ

సీఎంను కలిసిన కొత్త చైర్మన్లు

- చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన తాతయ్యబాబు, పీలా గోవింద

అనకాపల్లి/ బుచ్చెయ్యపేట సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవులు పొందిన జిల్లా నాయకులు బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అయిన బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అయిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణలు చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని, క్రమశిక్షణతో పనిచేసి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని చంద్రబాబునాయుడు సూచించారు.

ప్రాణాలు తీసిన సాగునీటి వివాదం

గొలుగొండ మండలం శ్రీరాంపురంలో రైతు దంపతులపై కత్తితో దాడి

- ఇద్దరికీ తీవ్రగాయాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భార్య మృతి

-7లో


గాయపడిన రామకృష్ణ


తీవ్రంగా గాయపడిన రామలక్ష్మి

పకడ్బందీగా బడి భోజనం

మెనూ అమలు, రుచి, పరిశుభ్రతకు ప్రాధాన్యం

రాజధాని అమరావతి నుంచి నిత్యం మానిటరింగ్

- జిల్లా కలెక్టర్ నుంచి హెచ్‌ఎంల వరకు పర్యవేక్షణ
- విద్యార్థులు అన్నం తిన్న తర్వాతే ఉపాధ్యాయులు భోజనం చేయాలి
- విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి నుంచి విద్యార్థులకు ఫోన్లు
- మధ్యాహ్న భోజనంపై ఆరా
- పాఠశాలల్లో డీఈవో తరచూ తనిఖీలు


మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, సెప్టెంబరు 25: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై రాజధాని అమరావతి నుంచి పర్యవేక్షణ పెరిగింది. భోజనం నాణ్యత, మెనూ అమలు, వంటశాలల పరిశుభ్రతపై జిల్లా కలెక్టర్ నుంచి విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయుల వరకు పర్యవేక్షణ చేయాలని ఆదేశాలు వచ్చాయి. జిల్లాలో 1,033 ప్రాథమిక, 148 ప్రాథమికోన్నత, 226 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 23,378 మంది, ఆరు నుంచి ఎనిమిది తరగతుల వరకు (ప్రాథమికోన్నత) 9,500 మంది, ఉన్నత పాఠశాలల్లో 62,559 మంది విద్యార్థులు ఉన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి తరచూ పాఠశాలలను సందర్శించి, విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం రుచి చూడాలి. భోజనం గురించి విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకోవాలి. పిల్లల సంఖ్యను బట్టి భోజనం వడ్డించే స్టాల్స్ పెంచాలి. వంటశాలను ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

నక్కపల్లి, సెప్టెంబరు 25: మండలంలోని ఉద్దండపురం వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గొడిచెర్ల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందారు. దీనికి సంబంధించి సీఐ కుమారస్వామి తెలిపిన వివరాలిలా వున్నాయి. నక్కపల్లి మండలం గొడిచెర్ల గ్రామానికి చెందిన ఆవాల నవీన్(19), కిల్లాడ నాగేశ్వరరావు (22), దేవవరం గ్రామానికి చెందిన దమ్ము సీతాలు స్నేహితులు. బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో ముగ్గురూ కలిసి బైక్‌పై వేంపాడు నుంచి గొడిచెర్ల వెళుతున్నారు. ఉద్దండపురం వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొన్నది. దీంతో నవీన్, నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందారు. దేవవరం గ్రామానికి చెందిన సీతాలు గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను నక్కపల్లి ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతిచెందిన యువకులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా వుంటున్నట్టు గ్రామస్థులు చెప్పారు. ఇద్దరు యువకులు మృతిచెందడంతో గొడిచెర్ల గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ ప్రమాదంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కుమారస్వామి చెప్పారు.

ప్రాణాలు తీసిన సాగునీటి వివాదం

- శ్రీరాంపురంలో రైతు దంపతులపై కత్తితో దాడి
- ఇద్దరికీ తీవ్రగాయాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భార్య మృతి



రామలక్ష్మి (ఫైల్ ఫొటో)

గొలుగొండ, సెప్టెంబరు 25: పాత కక్షలతోపాటు సాగునీటి విషయంలో తలెత్తిన వివాదం ఒక మహిళా రైతు ప్రాణాలు తీసింది. తన పొలంలోకి నీరు వస్తున్నదంటూ దిగువ పొలానికి చెందిన రైతు, ఎగువ పొలానికి చెందిన రైతు దంపతులపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళా రైతు మృతిచెందింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ రామారావు, స్థానికులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

మండలం కేంద్రమైన గొలుగొండ పంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన రుత్తల రామకృష్ణ, రామలక్ష్మి(42) దంపతులు. వీరి ఇంటికి సమీపంలోనే వ్యవసాయం భూమి వుంది. వీరి పొలానికి దిగువన చిటికెల తాతీలు పొలం వుంది. ఇరువురి మధ్య చాలా కాలం నుంచి సరిహద్దు గొడవ వుంది. అంతేకాక భారీ వర్షాలు కురిసినప్పుడు రామకృష్ణ పొలంలో నుంచి తాతీలు పొలంలోకి అధికంగా నీరు వస్తున్నది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురవడంతో పొలంలో నీరు అధికంగా చేరింది. దీంతో బుధవారం ఉదయం రామకృష్ణ దంపతులు పొలానికి వెళ్లి నీటిని బయటకు పంపే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో చిటికెల తాతీలు వచ్చి.. మీ పొలంలో నుంచి అధిక నీరు వస్తుండడంతో తన పంట దెబ్బతింటున్నదని రామకృష్ణ దంపతులతో గొడవ పడ్డాడు. ఇరువురి మధ్య మాటామాటా పెరిగి, తాతీలు తనతోపాటు తెచ్చుకున్న కత్తితో రామకృష్ణపై దాడికి దిగాడు. ఇది గమనించిన రామలక్ష్మి అడ్డుకునే యత్నం చేయగా, ఆమెపైనా కూడా దాడికి తెగబడ్డాడు. దీంతో రామలక్ష్మి చేతులకు, రామకృష్ణ తలపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను గొలుగొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో రామలక్ష్మి సాయంత్రం 4.30 సమయంలో మృతిచెందింది. రామకృష్ణ చికిత్స పొందుతున్నాడు. నిందితుడు తాతీలు పరారయ్యాడని, అతని కోసం గాలిస్తున్నామని ఎస్ఐ రామారావు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

తాండవ నదిలో యువకుడి గల్లంతు



శివమోహన్ (ఫైల్)

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 25: మండలంలో సత్యవరం గ్రామ శివారున బుధవారం ఒక యువకుడు తాండవ నది దాటుతూ ప్రమాదవశాత్తూ నీటి మునిగి గల్లంతయ్యాడు. సీఐ జి.అప్పన్న అందజేసిన వివరాల మేరకు.. సత్యవరం గ్రామానికి చెందిన ఏనుగు శివమోహన్(27) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. బుధవారం తమలపాకుల సేకరణ కోసం మరో పది మందితో కలిసి తాండవ నదికి అవతల వైపున ఉన్న తోటలకు వెళ్లాడు. పనులు పూర్తయిన తరువాత నదిపై సిమెంట్ స్తంభాలతో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన వంతెన మీదుగా వస్తుండగా నదిలో నీటి ప్రవాహం ఆకస్మికంగా పెరిగింది. దీంతో శివమోహన్ అదుపుతప్పి నీటిలో పడి కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. గజ ఈతగాళ్లను రప్పించి నదిలో గాలించారు. అయినా ఆచూకీ లభించలేదు. గురువారం ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని రప్పించి నదిలో గాలింపు చర్యలు చేపడతామని సీఐ అప్పన్న తెలిపారు.

మామపై దాడి కేసులో అల్లుడికి ఐదేళ్ల జైలు

చోడవరం/ బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 25: మామపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో అల్లుడికి ఐదేళ్ల కారాగార శిక్షతో పాటు, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఇ.రాజేంద్రబాబు బుధవారం తీర్పు ఇచ్చారు. కేసుకు సంబంధించి బుచ్చెయ్యపేట ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బంగారుమెట్ట గ్రామానికి చెందిన ముత్యాల నూకరాజు కుమార్తెతో అదే గ్రామానికి చెందిన సింగంపల్లి రాముతో వివాహమైంది. అదనపు కట్నం కోసం కూతురిని వేధిస్తుండడంతో నూకరాజుకు, రాముకు మధ్య గొడవ తలెత్తింది. 2021, జూలై 29న నూకరాజుపై రాము కత్తితో దాడి చేసి హతమార్చేందుకు ప్రయత్నించాడు. దీనిపై బుచ్చెయ్యపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో రాముకు ఐదేళ్ల కారాగార శిక్షతో పాటు, రూ.ఐదు వేల జరిమానా విధించారు. బాధితుడు నూకరాజుకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ కేసును అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేచలపు వెంకటరావు వాదించారు.

భువనేశ్వర్-యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక ఏసీ రైలు

విశాఖపట్నం, సెప్టెంబరు 25: దసరా, దీపావళి పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా భువనేశ్వర్, యశ్వంతపూర్‌ల మధ్య ప్రత్యేక వారాంతపు రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 02811 నంబరు గల రైలు అక్టోబరు 5 నుంచి నవంబరు 30 వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజాము 1.53 గంటలకు దువ్వాడ, అర్ధరాత్రి 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 02812 నంబరు గల రైలు అక్టోబరు 7 నుంచి డిసెంబరు 2 వరకు ప్రతి సోమవారం ఉదయం 4.30 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. ఈ సర్వీసులు 16 థర్డ్ ఏసీ కోచ్‌లతో ఖుర్దారోడ్డు, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నర్సారావుపేట, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, ధర్మవరం, సత్యసాయి ప్రశాంతి నిలయం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల, సెప్టెంబర్టు 25: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్ష కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు ఎనిమిదో తేదీన జరగనున్న ఈ పరీక్షకు అర్హులైన వారు అక్టోబరు మూడో తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు విద్యాశాఖాధికారులను సంప్రతించాలని కోరారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

ఆర్థిక రాజధానిగా విశాఖి

- ప్రపంచ డేటా హబ్‌గా అభివృద్ధి చేస్తాం
- 15 రోజుల్లో అంతర్జాతీయ కార్గో రవాణా ప్రారంభం
- మెట్రో రైలు ప్రాజెక్టును కూడా పట్టాలెక్కిస్తాం
- పెట్టుబడులు పెట్టేందుకు అనేకమంది ఆసక్తి
- చర్చలు జరుపుతున్నాం...త్వరలోనే ఫలితాలు వెల్లడిస్తాం
- ఐటీ కంపెనీల బకాయిలు క్లియర్ చేస్తాం
- ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్



ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఐఐ ప్రతినిధి డాక్టర్ మురళీకృష్ణ. పక్కన మంత్రి బీసీ జనార్దనరెడ్డి, ఎంపీ ఎం.శ్రీభరత్

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా మారుతుందని, మూడు ట్రిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుందని ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. సీఐఐ నోవాటెల్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. పారిశ్రామికవేత్తలు పారిపోయే పరిస్థితి తెచ్చారని ఆవేదన వ్యక్తంచేశారు. పరిస్థితులను చక్కదిద్ది మళ్లీ అభివృద్ధిని గాడిలో పెట్టేందుకు యత్నిస్తున్నామన్నారు. జగన్మోహన్ రెడ్డి వంటి సైకోలు సీఎంలు అయితే ఏమి జరుగుతుందో ప్రజలు తెలుసుకున్నారు కాబట్టి ఇకపై జాగ్రత్తగా ఉండాలన్నారు. విశాఖ నుంచి విదేశాలకు విమానాల ద్వారా సరకు పంపించుకునే సౌలభ్యం ఉండేదని, జగన్ హయాంలో అది కూడా పోయిందన్నారు. పదిహేను రోజుల్లో సరకు రవాణాకు చర్యలు చేపడతామన్నారు. విశాఖను ప్రపంచానికే డేటా హబ్‌గా మారుస్తామన్నారు. విశాఖపట్నం ఇప్పటికే ఐటీ డెస్టినేషన్‌గా మారిందని, ఫార్మా హబ్‌గా ఉందని, పెట్రో కెమికల్ కారిడార్ కూడా ఉందని, మరో వైపు నేవీ ఉందని, త్వరలో భోగాపురం విమానాశ్రయం కూడా అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతం రూపురేఖలే మారిపోతాయన్నారు. విశాఖలో మెట్రో రైలు ప్రాజెక్టును కూడా పట్టాల పైకి తెస్తామన్నారు. పెద్ద సంఖ్యలో పరిశ్రమలు ఉన్నందున డెడికేటెడ్ కారిడార్ ఉండాలని, దానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో భవిష్యత్తులో తక్కువ ధరకే విద్యుత్ లభిస్తుందని, అప్పుడు ఇక్కడికి రావడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతారన్నారు. విశాఖలో పెట్టుబడులకు అనేక మంది ఆసక్తిగా ఉన్నారని, కొంతమంది పారిశ్రామికవేత్తలు కూడా వచ్చారని, వారితో కలిసి క్షేత్ర పరిశీలన చేస్తామన్నారు. అనేక మంది చర్చలు జరుపుతున్నామని, వాటి ఫలితాలు ఏమిటో త్వరలో వెల్లడిస్తామన్నారు. వంద రోజుల్లో ఐటీ పాలసీ ప్రకటిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం ఐటీ కంపెనీలకు ఒక్క రూపాయి కూడా రాయితీ ఇవ్వలేదని, ఆ బకాయిలన్నీ త్వరలో క్లియర్ చేస్తామని చెప్పారు.

ఎలివేటెడ్ కారిడార్‌తో ఫ్లైఓవర్ల అనుసంధానం: శ్రీభరత్, ఎంపీ

ఈ సదస్సులో పాల్గొన్న విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, సిటీ నుంచి భోగాపురం విమానాశ్రయానికి వెళ్లడానికి ట్రాఫిక్ వల్ల చాలా సమయం పడుతుందన్నారు. ఇందుకోసం 12 ఫ్లైఓవర్లు నిర్మించాలనే ప్రతిపాదన ఉందన్నారు. అయితే మెట్రో రైలు ప్రాజెక్టు కూడా ఉన్నందున ఈ రెండింటికి ఉపయోగపడేలా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేయాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించారని, ఆ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారని చెప్పారు. ఎలివేటెడ్ కారిడార్‌లో మూడు చోట్ల ఫ్లైఓవర్లకు కనెక్టివిటీ ఉంటుందన్నారు. ఈ డిజైన్ కొంత క్లిష్టమైనదని అభిప్రాయపడ్డారు. విశాఖలో భూగర్భ కేబుల్ వ్యవస్థ కొంత మేరకు ఉందని, త్వరలోనే నగరం అంతా వేస్తారని, అయితే పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్‌ను ప్రతి ఒక్కరు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ వ్యయం తగ్గుతుందని సూచించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం 18 నెలల్లోనే పూర్తవుతుందని చెప్పారు.

రైవాడకు 1,500 క్యూసెక్కుల వరద

- గరిష్ఠస్థాయికి చేరువలో నీటిమట్టం
- కొనసాగుతున్న ఇన్‌ఫ్లో.. నేడు గేట్లు ఎత్తివేత?



రైవాడ జలాశయం

దేవరాపల్లి, సెప్టెంబరు 25: మండలంలోని రైవాడ జలాశయంలోకి భారీగా వరద నీరు చేరుతున్నది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, బుధవారం సమ్మెద గెడ్డ, పినకోట చల్ల గెడ్డల నుంచి 1500 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. దీంతో నీటిమట్టం 113.25 మీటర్లకు చేరుకుంది. నీటిమట్టం 113.5 మీటర్లకు చేరితే స్పిల్‌వే గేట్లు ఎత్తి, అదనపు నీటిని శారదా నదిలోకి విడిచిపెడతామని డీఈఈ ఎం.సత్యంనాయుడు తెలిపారు. పరీవాహక ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా సాధ్యమైనంత వరకు రాత్రివేళల్లోనే నదిలోకి నీటిని విడుదల చేస్తామని చెప్పారు. శారదా నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని కోరారు. కాగా జిల్లాలో రైవాడ మినహా మిగిలిన అన్ని జలాశయాలు ఈ నెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలతో పూర్తిగా నిండిపోయి, స్పిల్‌వే గేట్లు ఎత్తిన విషయం తెలిసిందే. రైవాడ జలాశయంలోకి ఎగువ నుంచి వరద ప్రవాహం అధికంగా వుండడంతో బుధవారం రాత్రి లేదా గురువారం ఉదయం గేట్లు ఎత్తే అవకాశం వుందని డీఈఈ చెప్పారు.

రావికమతం: మండలంలోని కల్యాణపులోవ జలాశయంలోకి వంద క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. జలాశయం ఇప్పటికే పూర్తిగా నిండడంతో రెండు గేట్లు ఎత్తి అదనపు నీటిని సర్పా నదిలోకి విడిచిపెడుతున్నట్టు ఏఈ సత్యనారాయణ దొర చెప్పారు. గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులుకాగా బుధవారం 458.8 అడుగుల వద్ద నీటిమట్టాన్ని స్థిరంగా వుంచుతూ అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహం పెరిగితే మరో రెండు గేట్లు ఎత్తుతామని ఈఏ చెప్పారు. రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం మండలాలకు చెందిన చీమలపాడు, జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం, కొత్తకోట, కన్నంపేట, జగ్గంపేట, జె.నాయుడుపాలెం, కొమరవోలు, ఆర్.కొత్తూరు, కుసర్లపూడి, తూటిపాల, తాడపాల, కొండల అగ్రహారం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



కల్యాణపులోవ రిజర్వాయర్ రెండు గేట్లు ఎత్తి సర్పా నదిలోకి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయంలోకి 150 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా బుధవారం సాయంత్రానికి 99.9 మీటర్లకు చేరుకుంది. ప్రధాన గేట్ల నుంచి 180 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు, నదిలోకి విడిచిపెడుతున్నట్టు ఏఈ సిహెచ్.జయరాంపడాల్ తెలిపారు. అయితే నీటిమట్టం వంద మీటర్లు దాటిన తరువాత ఇన్‌ఫ్లోను బట్టి నీటిని విడుదల చేస్తామని తెలిపారు. బొడ్డేరు నది పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉధృతంగా సర్పా, వరహానదుల ప్రవాహం

కోటవురట్ల, సెప్టెంబరు 25: అల్పపీడనం ప్రభావం కారణంగా మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలో గల సర్పా, వరహానదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మంగళవారం రాత్రి 9 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. మండలంలో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించడంతో చెరువుల్లోకి నీరు పుష్కలంగా చేరుతోంది.



గొట్టివాడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరహానది

సీహెచ్‌సీలో వసతులపై కలెక్టర్ ఆరా

- ఎమ్మెల్యే సుందరపుతో కలిసి ఆస్పత్రి సందర్శన
- కనీస సౌకర్యాలు లేవని చెప్పిన వైద్యులు
- పాత సీహెచ్‌సీ భవనంలో ఆస్పత్రి నిర్వహిస్తే బాగుంటుందని ఎమ్మెల్యే సూచన



సీహెచ్‌సీని సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు

ఎలమంచిలి, సెప్టెంబరు 25: ఎలమంచిలిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తో పాటు కోర్టు భవనాలను కలెక్టర్ విజయకృష్ణన్, స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ బుధవారం పరిశీలించారు. పట్టణంలోని తులసీనగర్‌లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.3 కోట్లతో సీహెచ్‌సీ నూతన భవనాన్ని నిర్మించి ఎన్నికల ముందు హడావిడిగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే ఈ భవనం అరకొర వసతులతో ఉండడంతో రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన కలెక్టర్‌తో కలిసి ఆస్పత్రిని సందర్శించి వసతులపై ఆరా తీశారు. ఈ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వసతులు లేవని కలెక్టర్‌కు వైద్యులు వివరించారు. ఇక్కడికి రావడానికి రహదారి సౌకర్యం కూడా లేదన్నారు. పాత సీహెచ్‌సీ భవనంలోనే ఆస్పత్రి నిర్వహిస్తే బాగుంటుందని కలెక్టర్‌కు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో పాత సీహెచ్‌సీ భవనాలను కలెక్టర్, ఎమ్మెల్యే, మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ వరహాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, లవుడు లోవరాజు, పిట్టా శ్రీను, గుర్రాల శేఖర్, కొరారు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బొజ్జన్నకొండ అభివృద్ధి పనులకు శ్రీకారం

తుమ్మపాల, సెప్టెంబర్టు 25 : ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద రూ.7.5 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టినట్టు పర్యాటకశాఖ ఈఈ రమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం బొజ్జన్నకొండ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పాటు పలువురు కేంద్ర మంత్రులు ఈ అభివృద్ధి పనులను వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని చెప్పారు. బొజ్జన్నకొండ వద్ద నిర్మించిన ధ్యానమందిరం, లేజర్ షో థియేటర్, పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామ్మూర్తి, ఎంపీడీవో కేవీ నరసింహరావు, అధికారులు పాల్గొన్నారు.

లా వర్సిటీ విద్యార్థినుల ప్రతిభ

సబ్బవరం, సెప్టెంబరు 25: ఏఐఏడీఆర్ రెండవ అంతర్జాతీయ క్రాస్ యూనివర్సిటీ మధ్యవర్తిత్వ పోటీల్లో స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం విద్యార్థినులు తమ ప్రతిభను చాటుకున్నారు. మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఆసియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ వారు నిర్వహించిన రెండవ ఏఐఏడీఆర్ ఇంటర్నేషనల్ మీడియేషన్ కాంపిటేషన్-2024లో దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ విద్యార్థినులు వినీల కొత్తపల్లి, అంకిత వర్ధిక విజేతలుగా నిలిచారని వర్సిటీ వీసీ డి.సూర్యప్రకాశరావు తెలిపారు. ఈ సందర్భంగా వారిని బుధవారం వర్సిటీలో ఘనంగా సత్కరించారు.

కాంగ్రెస్ నిరసన ప్రదర్శన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

తుమ్మపాల, సెప్టెంబరు 25: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద ఆ పార్టీ నాయకులతో కలిసి 'థాలీ బజావో' కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలియజేశారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలు కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బి.కిశోర్, ఉపాధ్యక్షుడు బి.బాలమురళి, పీసీసీ సభ్యులు టి. రమణ, ఎం.కోటేశ్వరరావు, బి.భానుమూర్తియాదవ్, పడాల కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు శ్రీప్రకాష్ రూ.10 లక్షల విరాళం



చెక్కును డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు అందజేస్తున్న సీహెచ్ విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట, సెప్టెంబరు 25: విజయవాడ వరద బాధితులకు సాయం చేయడం కోసం పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యాసంస్థలు ముఖ్యమంత్రి వరద సహాయ నిధికి రూ.10 లక్షలు విరాళం ప్రకటించింది. ఈ మేరకు విజయ వాడలో మంగళవారం రాత్రి డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ను విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ కలిసి చెక్కును అందజేశారు.

పేట హైస్కూల్ హెచ్‌ఎంపై డీఈవో ఆగ్రహం

- నోట్ బుక్స్ కరెక్షన్ చేయని తెలుగు ఉపాధ్యాయుడు
- పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై అసహనం
- ముగ్గురికి షోకాజ్ నోటీసులు



హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ

పాయకరావుపేట, సెప్టెంబరు 25: విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల హెచ్‌ఎం, ఒక టీచర్‌తోపాటు మరొకరికి డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లా విద్యా శాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ బుధవారం పాయకరావుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల పుస్తకాలను తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థుల తెలుగు నోట్ బుక్స్‌ను ఉపాధ్యాయుడు శంకర్ కరెక్షన్ చేయకపోవడాన్ని గమనించారు. అతనితోపాటు హెచ్ఎం జాన్ ప్రసాద్‌పై డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని తరగతుల విద్యార్థుల నోట్ బుక్‌లను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు కరెక్షన్ చేసేలా చూడాలని చెప్పారు. విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో దగ్గరుండి పర్యవేక్షించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం హెచ్‌ఎంతోపాటు నోట్ బుక్ కరెక్షన్ చేయని తెలుగు ఉపాధ్యాయుడికి, పరిసరాలు పరిశుభ్రంగా వుంచని కుమారికి షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఆమె వెంట ఎంఈఓలు గాంధీ, రమేశ్ వున్నారు.

బకాయిలు రూ.36 లక్షలు ఇప్పించండి



స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కళాకారులు

నర్సీపట్నం, సెప్టెంబరు 25: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2017-18లో గ్రామ దర్శిని, జన్మభూమి కార్యక్రమాల్లో కళాజాత నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా కళాకారులకు ఇవ్వాల్సిన రూ.36 లక్షలు బకాయిలను ఇప్పించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడును కళాకారుల సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వ పథకాలపై కళాజాత నిర్వహించకపోవడంతో ఉపాధి కోల్పోయామని తెలిపారు. జిల్లాలో జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారాలకు ఇక్కడ కళాకారులకు అవకాశం ఇవ్వాలని కోరారు. అయ్యన్నపాత్రుడు స్పందించి త్వరలో కళాజాత బకాయిలు విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారుల జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు, కార్యదర్శి వి.దివాకర్ పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ 'ఓపెన్' ప్రవేశాలకు గడువు పొడిగింపు

తుమ్మపాల, సెప్టెంబర్టు 25: ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 28వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలస్య రుసుము రూ.200లు చెల్లించి ఈ నెల 30వ తేదీ లోపు పేర్లను నమోదు చేసుకోవచ్చునన్నారు. అభ్యర్థులు ఫీజులను ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించుకోవచ్చునని తెలిపారు. విద్యను మధ్యలో ఆపేసిన గృహిణులు, వ్యాపారులు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా సుధీర్

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్‌గా వి.సుధీర్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన విశాఖ జిల్లా నుంచి బదిలీ అయ్యారు. విశాఖ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఆర్.ప్రసాద్ నియమితులయ్యారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా బాపట్లలో సెబ్ ఏసీగా పనిచేసిన సీహెచ్ మహేష్‌కుమార్‌ను నియమించింది. ప్రస్తుతం జోన్-1 సెబ్ డీసీగా పనిచేస్తున్న డి.శ్రీరామ్మూర్తిని సెబ్ నుంచి రిలీవ్ చేస్తూ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా పూర్తి బాధ్యతలు అప్పగించింది.

సమగ్ర భూ సర్వే సక్రమంగా జరగలేదు

- గత ప్రభుత్వంలో ఇచ్చిన పట్టాదారు పాస్ పుస్తకాలను రద్దు చేయాలి
- కూటమి సర్కారు మళ్లీ రీ సర్వే నిర్వహించి కొత్తగా పుస్తకాలు ఇవ్వాలి
- గ్రామాల్లో సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలి
- రాంబిల్లి మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు వినతి



ఎంపీపీ శిరీషా అధ్యక్షతన మండల సమావేశం జరుగుతున్న దృశ్యం

రాంబిల్లి, సెప్టెంబరు 25 : గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించనప్పుడు సమావేశాలు ఎందుకని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు. బుధవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జి.శిరీషా అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. వైస్ ఎంపీపీ కొటాపు లక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో నిర్వహించిన సమగ్ర భూ సర్వే సక్రమంగా జరగలేదని ఆరోపించారు. ఆ ప్రభుత్వం ఇచ్చిన పట్టాదారు పాస్ పుస్తకాలను రద్దుచేసి, మళ్లీ సర్వే చేపట్టి కొత్తపట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని కోరారు. సచివాలయాల్లో ఆరోగ్య సిబ్బంది ప్రజలు అందుబాటులో ఉండకపోవడం వలన ప్రజలు రోగాలతో ఇబ్బందులు పడుతున్నారని కొప్పుగొండుపాలెం, కృష్ణంపాలెం సర్పంచ్‌లు బి.హరిబాబు, పి.సత్తిబాబు ఆరోపించారు. ప్రతి గ్రామంలో రైతు సదస్సులు ఏర్పాటు చేసి రైతుల సమస్యలను పరిష్కరించాని పలువురు కోరారు. హరిపురంలోని నూకాలమ్మ మాన్యం వద్ద విద్యుత్ స్తంభం వాలిపోయి వైర్లు వేలాడుతున్నాయని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని సర్పంచ్ డి.దేముడమ్మ కోరారు. గ్రామాలకు తాగునీరు అందించే రక్షిత మంచినీటి పథకాలు, బోర్లు నేవీ పరిధిలో గల గ్రామాలను ఆనుకొని ఉన్న కొండలపైనే ఉన్నాయని, ఈ కొండల చుట్టూ ప్రస్తుతం నేవీ ప్రహరీ గోడ నిర్మిస్తుండడం వల్ల నీటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని కొప్పుగొండుపాలెం, పెద కలవలాపల్లి సర్పంచ్‌లు హరి, కనకరావు ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని తప్పించి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టేలా చూడాలని అధికారులకు విన్నవించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు, ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు, తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు కొటాపు లక్ష్మి, కశిరెడ్డి నర్సింగరావుతో పాటు ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించండి'

పరవాడ (మునగపాక), సెప్టెంబరు 25 : గ్రామాల్లో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని మునగపాక మండల ప్రత్యేకాధికారిణి మంజులావాణి సూచించారు. బుధవారం వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గృహ నిర్మాణ పథకం కింద చేపట్టిన ఇళ్లను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మిగిలిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి కావాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఇన్ చార్జి ఎంపీడీవో టీవీఎస్ ప్రసాద్‌కుమార్, హౌసింగ్, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందాం

... 5వ పేజీ తరువాయి

మరికొందరు సందేహం వ్యక్తంచేశారు. కర్మాగార యాజమాన్యం ఒంటెత్తు పోకడలు, కార్మికుల్లో కొందరి ప్రవర్తనపై కూడా ప్రజల్లో అపోహలు ఉన్నాయని కొందరు అన్నారు. అందువల్ల పటిష్టమైన యాజమాన్యం ఉండాలని అభిప్రాయపడ్డారు. కేంద్ర పరిధిలో ఉన్న భూములు మొత్తం బదిలీ చేస్తే బ్యాంకులు నుంచి రుణం తీసుకుని కర్మాగారానికి నడుపుకోవచ్చునని సమావేశంలో ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. ఏదోవిధంగా కర్మాగారాన్ని నిలబెట్టుకోవాలని, సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు నివేదిక రూపంలో సమర్పించాలని తీర్మానించారు. చంద్రబాబు ద్వారా కేంద్రంతో చర్చించి ఒక నిర్ణయం తీసుకోవాలని, అందుకు కాలయాపన కాకుండా సత్వరమే చర్యలు ఉండాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ విశాఖపై తనకు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. పాదయాత్ర సమయంలో ఉక్కు కర్మాగారానికి పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చానని గుర్తుచేశారు. విశాఖ ఉక్కుతో ప్రతి తెలుగువాడికి ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, హైదరాబాద్‌లో తమ ఇంటికి విశాఖ ఉక్కు స్టీల్ వాడామన్నారు. కర్మాగారాన్ని వెంటాడుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి కార్మికుల కళ్లల్లో ఆనందం చూడాలనే దృఢ సంకల్పంతో కేంద్రంతో సంప్రతింపులు జరుపుతున్నామని అన్నారు. అందరికీ ఆమోద్యమైన పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలను చంద్రబాబునాయుడుకు నివేదిస్తామన్నారు. కేంద్రంతో సీఎం చర్చించి ఉక్కు కర్మాగారంపై ఒక నిర్ణయం తీసుకుంటారని లోకేశ్ వెల్లడించారు. రానున్న రోజుల్లో మిగతా సమస్యలపై చర్చించుకుని నిర్ణయాలు తీసుకుందామన్నారు. అందరూ కూర్చుని చర్చించుకుంటే పరిష్కారం కాని సమస్య ఉండదన్నారు. సమావేశంలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయకుమార్, కోండ్రు మురళి, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, టీడీపీ పెందుర్తి, విశాఖ దక్షిణ ఇన్‌చార్జులు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, సెయిల్ డైరెక్టర్, బీజేపీ నాయకుడు కాశీవిశ్వనాథరాజు పాల్గొన్నారు.

పకడ్బందీగా బడి భోజనం

... 5వ పేజీ తరువాయి

పరిశుభ్రంగా ఉంచడంతోపాటు వంట చేసేవారు కూడా పరిశుభ్రత పాటించాలి. మధ్యాహ్నం భోజనం వడ్డించే సమయంలో ఉపాధ్యాయులంతా దగ్గర ఉండి పిల్లలు అన్నం తీనే వరకు పర్యవేక్షణ చేయాలని, విద్యార్థులు భోజనం చేయడం పూర్తయిన తర్వాతే టీచర్లు భోజనానికి వెళ్లాలని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అమరావతి నుంచి విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి పలు పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి, మధ్యాహ్న భోజనం గురించి పిల్లలను వాకబు చేస్తున్నారు. మెనూ అమలు తీరు, భోజనం నాణ్యత గురించి అడుగుతున్నారు.

బడి భోజనంపై పర్యవేక్షణ పెంచాం

- ఎం.వెంకట లక్ష్మమ్మ, డీఈవో

మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నది. ఎక్కడా చిన్న పొరపాటుకి కూడా తావులేకుండా ఉండాలని వీడియో కాన్ఫరెన్సుల ద్వారా అధికారులను అప్రమత్తం చేస్తూ పర్యవేక్షణ చేస్తున్నది. దీంతో జిల్లాలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై పర్యవేక్షణ పెంచాం. రుచి, నాణ్యత, శుభ్రత విషయాల్లో రాజీ పడొద్దని ఎంఈవోలకు, హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశాం.

అచ్యుతాపురంలో రోడ్ల విస్తరణ అత్యవసరం

- పారిశ్రామికవాడ కావడంతో నిత్యం వాహనాలతో రద్దీ
- పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం



కలెక్టర్ విజయ కృష్ణన్‌కు అచ్యుతాపురం జంక్షన్‌లో మ్యాప్ చూపిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 25 : మండల కేంద్రం అచ్యుతాపురం నాలుగు రోడ్ల జంక్షన్‌లో విస్తరణ పనులు అత్యవసరమని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆమె ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్, ఆర్‌డీవో చిన్నికృష్ణతో కలిసి పర్యటించారు. ఇక్కడున్న వందలాది కంపెనీలకు వాహనాల రాకపోకలకు అచ్యుతాపురం జంక్షన్ కీలకం అన్నారు. అందువల్ల త్వరితగతిన విస్తరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం దిబ్బపాలెం పునరావాస కాలనీలో పర్యటించి, ఇక్కడ నిర్మించ తలపెట్టిన స్పోర్ట్స్ క్లబ్ క్రీడా మైదానం స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే సుందరపుతో చర్చించి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'దివ్యాంగులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

రాంబిల్లి : మండలంలోని కొత్తూరులో ఆర్టీసీ కూర్మన్నపాలెం డిపో మేనేజర్ గౌతమ్ ఛటర్జీ, అసిస్టెంట్ మేనేజర్ పి.శ్రీనివాసరావు బృందం బుధవారం దివ్యాంగులకు సిటీ, రూరల్ బస్ పాస్‌లను అందజేశారు. తొలుత ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. వైస్ ఎంపీపీ కొటాపు లక్ష్మి, సర్పంచ్ నానేపల్లి సాయిలక్ష్మి, వికలాంగుల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ గాదం కాసులు, రాంబిల్లి మండల శాఖ అధ్యక్షుడు తోట మోహన్‌రావు, జనసేన నాయకులు కోన బాబి, మాజీ సర్పంచ్ నానేపల్లి సాయి, ఎంపీటీసీ అల్లవరపు బాబ్జీ, దిమిలి మాజీ సర్పంచ్ కొటాపు వడ్డీకాసులు తదితరులు పాల్గొన్నారు.

అలాగే, మామిడివాడ కొత్తూరు గ్రామంలో నిర్వహించిన పశు పశువైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ బి.మోహన్‌రావు, ఎలమంచిలి సహాయ సంచాలకులు డాక్టర్ సిహెచ్.ఎం.ఎం.గంగాధర్, అచ్యుతాపురం సహాయ సంచాలకులు డాక్టర్ వి.సునీల్, పంచదార్ల పశువైద్యాధికారి డాక్టర్ కె.రఘునాథ్, డాక్టర్ వీఎల్‌కే మాధురి, గర్భకోశ చికిత్స నిపుణులు డాక్టర్ కె.నాగశివకుమార్, సర్పంచ్ నానేపల్లి సాయివరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమ పాలనే ధ్యేయం'



వాడచీపురుపల్లిలో మాట్లాడుతున్న పంచకర్ల

పరవాడ, సెప్టెంబరు 25 : రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వాడ చీపురుపల్లిలో బుధవారం పర్యటించి మాట్లాడారు. వంద రోజుల పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సామూహిక సీమంతాల కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ ఎంపీపీలు మాసవరపు అప్పలనాయుడు, పైలా జగన్నాథరావు, సర్పంచ్‌లు శివలంక లక్ష్మి, మోటూరు సన్యాసినాయుడు, సిరపురపు అప్పలనాయుడు, ఎంపీడీవో శ్యామసుందరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అమలు చేసిన పథకాలను వివరించారు. నాయకులు మచ్చ శివకుమార్, కరణం అప్పారావు, పిళ్లా శివకృష్ణ, లక్కరాజు సంజీవమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చినరాజుపేటలో...

అనకాపల్లి టౌన్ : ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు అమలులోకి తీసుకువచ్చారని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన చినరాజుపేటలో పర్యటించి వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించారు. నాయకులు కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, కాండ్రేగుల సత్యనారాయణ, వానపల్లి త్రినాథరావు, పందూరి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుండపోతతో అండర్ బ్రిడ్జి జలమయం

- నిలిచిపోయిన ప్రైవేటు కళాశాల బస్సు



నీళ్లలో నిలిచిపోయిన కళాశాల బస్సును నెడుతున్న యువకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 25: పట్టణంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురియడంతో స్థానిక విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి జలమయమైంది. దీంతో బుధవారం ఉదయం ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన బస్సు నీళ్లలో చిక్కుకుపోయింది. బస్సులోని విద్యార్థులు, స్థానిక యువకులు బస్సును నెట్టినా కదలేదు. ఎట్టకేలకు ట్రాక్టర్ సహాయంతో బస్సును నీటి లోంచి బయటకు తీశారు. అలాగే సుంకరమెట్ట జంక్షన్ నుంచి విశాఖపట్నానికి వెళ్లే మార్గంలోని పెట్రోల్ బంకు వద్ద భారీ గోతుల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో అనకాపల్లి మండలంలోని క్రషర్ల నుంచి లోడుతో వెళుతున్న టిప్పర్ కూడా మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో నిలిచిపోయింది. బుధవారం తెల్లవారుజామున మరో వాహనం సహాయంతో లారీని బయటకు తీశారు.

కొత్తూరు : అనకాపల్లి మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా పడడంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. కొత్తూరులో ఉన్న శారదానగర్‌లోని పలు వీధులు వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి. దీంతో రాకపోకలకు ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసినప్పుడల్లా తాము ఇదే సమస్యను ఎదుర్కొంటున్నామని, అధికా రులు స్పందించి పరిష్కారం చూపాల్సిందిగా అంతా కోరుతున్నారు.

ప్రముఖ చిత్ర గాయకుడు ఎస్‌పీ బాలుకు నివాళి



బాలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 25 : ప్రముఖ చిత్ర గాయకుడు, దివంగత ఎస్‌పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతిని బుధవారం ఇక్కడి ఉడ్‌పేటలోని కళ్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్‌లో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సంగీత దర్శకులు ఇంద్రగంటి లక్ష్మీశ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1966 డిసెంబరు 15న శ్రీశ్రీ మర్యాద రామన్న చిత్రం ద్వారా బాలసుబ్రహ్మణ్యం గాయకునిగా సినీ పరిశ్రమలో రంగప్రవేశం చేశారన్నారు. 2020 వరకు సుమారు 50వేలకు పైగా పాటలు పాడి మరో పక్క సంగీత దర్శకులుగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా, నటుడుగా, నిర్మాతగా అనేక విభాగాల్లో తనదైన ముద్రను వేశారని కొనియాడారు. అకాడమీ ప్రిన్సిపాల్ నడిగట్ల వెంకటలక్ష్మి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి

కొత్తూరు, సెప్టెంబరు 25 : బీజేపీ జనసంఘం వ్యవస్థాపకులు దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌టీ కాలనీ, శారదానగర్‌లో ఉన్న బాబా ఆలయం వద్ద ఈ వేడుక జరిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు హాజరై ఆయన జీవిత విశేషాలను వివరించారు. స్టేట్ ఓబీసీ మోర్చా కార్యదర్శి కర్రి రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండబాబు, కన్వీనర్ బొడ్డేటి నాగేశ్వరరావు, నాగమణి పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : జీవీఎంసీ 80వ వార్డు సతకంపట్టులో గల పాఠశాలలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని నిర్వహించారు. బీజేపీ వార్డు అధ్యక్షుడు మారిశెట్టి భాస్కరరావు, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి బొడ్డేడ మురళీ, బుద్ద శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాంబిల్లి : వాడనర్సాపురంలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కారే రాముడు పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కిసాన్‌మోర్చ కార్యదర్శి ధర్మాల గోవిందరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగలిపురంలో స్వచ్ఛత హీ సేవ

సబ్బవరం, సెప్టెంబరు 25 : మొగలిపురంలో బుధవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సర్పంచ్ గండి అరుణ ఆవిష్కరించారు. అనంతరం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గ్రామ పెద్దలు తమరాన బంగారునాయుడు, వార్డు సభ్యులు అంగటి నానాజీ, తమరాన సత్యనారాయణ, రాంబాబు, రాము, పాల్గొన్నారు.

కూలీ రేట్లు పెంచాలని హమాలీలు నిరసన

తుమ్మపాల, సెప్టెంబర్టు 25 : పౌర సరఫరాల హమాలీల కూలీ రేట్లను పెంచాలని సివిల్ సప్లయి హమాలీల జిల్లా ప్రధాన కార్యదర్శి కండేపల్లి త్రినాథ్ డిమాండ్ చేశారు. బుధవారం హమాలీలతో కలిసి అనకాపల్లిలోని శంకరం వద్ద గల ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీల కూలీ రేట్ల అగ్రిమెంట్ పూర్తయి తొమ్మిది నెలలు గడుస్తున్నప్పటికీ కొత్త అగ్రిమెంట్ చేయకపోవడం తగదన్నారు.

రైతులంతా రుణాలు సకాలంలో చెల్లించాలి

కశింకోట, సెప్టెంబరు 25 : రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలని నర్సింగబిల్లి సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యేశ్వరి అన్నారు. బుధవారం సహకార సంఘం ఆవరణలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. సంఘం ద్వారా పంటల సాగుకు రుణాలు ఇస్తున్నామన్నారు. కలిగెట్ల సింహాద్రి, మాజీ ఎంపీటీసీ మజ్జి నిరంజన్‌కుమార్, కోన నాగేశ్వరరావు, మజ్జి కన్నబాబు, కోన సత్యనారాయణ, కార్యదర్శి అచ్చియ్యనాయుడు పాల్గొన్నారు.

నేడు దుర్గమాంబ పండగ

కశింకోట, సెప్టెంబరు 25 : మండల కేంద్రం కశింకోటలోని పెద్దగుమ్మం వీధిలో కొలువుదీరిన దుర్గమాంబ పండగ గురువారం ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఆలయ నిర్మాణ వ్యవస్థాపకుడు మళ్ల బుల్లిబాబు తెలిపారు. వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు ప్రారంభం కానున్నాయని, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

'లడ్డూను అపవిత్రం చేసిన వారిని శిక్షించాలి'



గవరపాలెంలో నిరసన తెలుపుతున్న బుద్ధ, తదితరులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 25 : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. 81వ వార్డు గవరపాలెంలో బుధవారం 'పాపాత్ములను శిక్షించండి.. సనాతన ధర్మాన్ని రక్షించండి' అనే నినాదంతో పలువురు భక్తులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బుద్ద వారికి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. పవిత్రమైన లడ్డూ ప్రసాదాన్ని జగన్‌రెడ్డి ప్రభుత్వం రివర్స్ టెండర్‌లో కాసులకు కక్కుర్తిపడి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బొడ్డేడ అయ్యప్ప, పొలమరశెట్టి చందు తదితరులు పాల్గొన్నారు.

ఘటాల గుడి వద్ద సిద్ధి వినాయకునికి పూజలు



వినాయకుడ్ని దర్శించుకుంటున్న పంచకర్ల వెంకటేశ్వరరావు

సబ్బవరం, సెప్టెంబరు 25 : ఇక్కడి పాత పోస్టాఫీస్ వీధి ఘటాల గుడి వద్ద ఏర్పాటు చేసిన సిద్ధి వినాయక మండపంలో స్వామివారిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు సోదరులు వెంకటేశ్వరరావు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. సాయంత్రం సాయినగర్ ఎస్సీ, బీసీ కాలనీలో వినాయక విగ్రహాన్ని ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. ఘటాల గుడి యూత్, కూటమి నాయకులు ఇందలి వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, గండి దుర్గాప్రసాద్, కర్రి కనకరాజు, కేవీ సత్యనారాయణ, కొరాడ శ్రీను, ఉగ్గిన రాము, టి.శేఖర్, జెట్టి ప్రసాద్, శరగడం అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్సు సంబరాలు ప్రారంభం

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 25 : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగే చెకుముకి సైన్సు సంబరాలలో భాగంగా బుధవారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో టాలెంట్ టెస్టుకు సంబంధించిన కరపత్రాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు తదితరులు బుధవారం ఆవిష్కరించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.ఉమాదేవి, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మద్దెల నానాజీ, జిల్లా కార్యదర్శి గుత్తుల సూర్యప్రకాష్, ఉపాధ్యాయులు కె.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

తరగతి గది మరమ్మతులకు ఆర్థిక సాయం

నక్కపల్లి, సెప్టెంబరు 25 : పెదబోదిగల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1997లో టెన్త్ చదువుకున్న కమిడి రమణ, ఖాశీషా, ఈశ్వరరావు తదితరులు పాఠశాలలో ఒక తరగతి గది మరమ్మతులకు అవసరమైన రూ.50 వేలను హెచ్ఎం చోడిశెట్టి సత్యనారాయణకు బుధవారం అందజేశారు. వీరి స్ఫూర్తితో హెచ్ఎం చోడిశెట్టి సత్యనారాయణ కూడా తనవంతుగా రూ.10వేలను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మున్నీషాబేగం, పెద్దలు బషీర్, హుస్సేన్, లక్ష్మణరావు, ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, కుమారి, చిన్నారావు, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 25 : ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ యువత సేవాభావాన్ని అలవర్చు కోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.మోహనరావు, తేజ, చరిష్మా పాల్గొన్నారు.

పాఠశాల పారిశుధ్య సిబ్బంది ఆందోళన

ఎలమంచిలి, సెప్టెంబరు 25 : వేతన బకాయిలు కోరుతూ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు బుధవారం ఇక్కడ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ శివాజీ మాట్లాడుతూ పాఠశాలల్లో తరగతి గదులను, మరుగుదొడ్లను నిత్యం శుభ్రంగా ఉంచే ఈ వర్కర్ల వేతనాలు ఏడు నెలలుగా చెల్లించకపోవడం దారుణమన్నారు.

పింఛన్ వెరిఫికేషన్‌లో 31 మంది గుర్తింపు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 25 : ఎన్టీఆర్ భరోసా పింఛన్ వెరిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం 31 మందిని గుర్తించినట్టు ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, చీడికాడ మండలాల నుంచి ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన శిబిరానికి 45 మంది హాజరైనట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గంగాధర్, అశోక్‌కుమార్, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

'ప్రకృతి వ్యవసాయ సిబ్బందిపై కక్షసాధింపు తగదు'

తుమ్మపాల, సెప్టెంబరు 25: ప్రకృతి వ్యవసాయ సిబ్బందిపై కక్ష సాధింపు చర్యలు తగవని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మెంబర్ బోనాల దేవి అన్నారు. బుధవారం అనకాపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయశాఖకు అనుబంధంగా కొనసాగుతున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బందిపై డీపీఎం కక్షపూరిత చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. 18 నెలలుగా జీతాలు చెల్లించకపోగా డీపీఎంకు నచ్చని వారిని పలు ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ పి.నాగేశ్వరరావు, ఎలమంచిలి టీడీపీ నాయకుడు బి.కృష్ణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ శివదత్‌కు పలువురు అభినందన



శివదత్‌ను సత్కరిస్తున్న పెంకుల రాజు తదితరులు

నక్కపల్లి, సెప్టెంబరు 25 : జనసైనికుడిగా జనసేన పార్టీలో పనిచేయడం చాలా గర్వంగా ఉందని రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ అన్నారు. బుధవారం ఇక్కడ ఆయనను పలువురు నాయకులు కలిసి అభినందించిన సందర్భంగా మాట్లాడారు. పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా తనను నియమించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ పెంకుల రాజు, సీహెచ్‌బీ అగ్రహారం మాజీ సర్పంచ్ వెదుళ్ల పాపారావు, కాగిత ఎంపీటీసీ ఆకేటి గోవిందరావు, జనసేన నాయకులు పిక్కి స్వామి, యలమంచిలి చంద్రరావు, పాము గణేశ్, పిక్కి స్వామి, కురందాసు అప్పలరాజు, బంగారి రాజు ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి సత్కరించారు.

'సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తే సత్ఫలితాలు'



ఎస్.రాయవరం : చిన గుమ్ములూరులో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త కుమారి బృందం

రాంబిల్లి, సెప్టెంబరు 25 : పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని రైతులు తగ్గించాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖాధికారులు సూచించారు. రాంబిల్లి, జడ్.చింతువా గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.చంద్రశేఖర్, అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం ఏవో వి.తులసీమని, ఉద్యానవన శాఖాధికారి సాయిప్రియ మాట్లాడుతూ పంటల సాగులో మెలకువలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ చిన్నారావు, విహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : పంటల సాగులో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు అందించే సూచనలు, సలహాలను రైతులు విధిగా పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని ఏవో మోహన్‌రావు సూచించారు. ఎలమంచిలిలో జరిగిన పొలం బడిలో రైతులకు సూచనలు చేశారు. మార్కెట్ కమిటీ సిబ్బంది లక్ష్మణరావు, వ్యవసాయ సహాయకులు అరుణ పాల్గొన్నారు.

కశింకోట : వెదురుపర్తిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో స్వప్న పంటల సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. పశువైద్యాధికారి డాక్టర్ ఆల్ఫాజార్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : ప్రస్తుతం వరి పంటలో పొటాషియం లోపాన్ని సవరించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని బీసీటీ-కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ అన్నారు. డొంకాడ, గొడిచెర్ల గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఏవో ఉమాప్రసాద్, బుజ్జమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు రజిత, సురేంద్ర, ఏఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలోని చినగుమ్ములూరు, పెద గుమ్ములూరు గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎంఆర్‌జీఎస్ కుమారి, ఏవో సౌజన్య పర్యటించి రైతులకు పంటల సాగులో మెలకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంభించడం ద్వారా ఖరీఫ్‌లో అధిక దిగబడులు సాధించవచ్చునని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త దాడి ఉమామహేశ్వరరావు అన్నారు. ఆరిపాక, బంగారమ్మపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. ఏవో పోతల సత్యనారాయణ, డాక్టర్ స్వర్ణలత, పి.అపర్ణ, గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, రాపేటి రాము, శరగడం రాము, ఆడారి నాగరాజు, పైడింనాయుడు, మల్ల వెంకటరమణ పాల్గొన్నారు.

పరవాడ : వ్యవసాయ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ లక్ష్మి అన్నారు. భరిణికం, వాడచీపురుపల్లి గ్రామాల్లో జరిగన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త పద్మావతి, ఏవో సీహెచ్.చంద్రావతి, ఉద్యానవన శాఖాధికారిణి లావణ్య నాయకులు బొండా తాతారావు, బొండా సన్యాసిరావు, గణేష్‌రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే రాజు



గౌరీపట్నంలో పర్యటిస్తున్న చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, సెప్టెంబరు 25 : గ్రామాల్లో సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు భరోసా ఇచ్చారు. మండలంలోని గౌరీపట్నంలో బుధవారం సాయంత్రం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్థానిక నేతలతో కలిసి వీధులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అంజనేయులు, స్థానిక నాయకులు పల్లేల గోపి, మునలి నాయుడు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సంక్షోభంలోనూ సంక్షేమం

» మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



వ్యవసాయ డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి, సెప్టెంబరు 25 : రాష్ట్రం తీవ్ర సంక్షోభంలో ఉన్నా తన అపార అనుభవంతో సీఎం చంద్రబాబు ప్రగతిపథంలో నడిపిస్తున్నారని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కితాబు ఇచ్చారు. మండలంలోని ఎం.అలమండ, కాశీపురం గ్రామాల్లో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం'కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారులు డ్రోన్ ద్వారా ఎరువులు వినియోగంపై అవగాహన కలిగించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, నేతలు పైలా ప్రసాదరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాయపురెడ్డి కృష్ణ, పోతల పాత్రునాయుడు, అచ్చియ్యమ్మ, కాశీపురం సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్, ఏవో కాంతమ్మ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో గురువుకు గుర్తింపు



రామకృష్ణను ఘనంగా సన్మానిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

గొలుగొండ, సెప్టెంబరు 25 : విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దితే సమాజంలో గురువులకు ఎంతో గౌరవమని ఉపాధ్యాయ సంఘాల మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలో గల బాలయోగి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ పదవీవిరమణ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో రామకృష్ణ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ప్రిన్సిపాల్ వద్ద విద్యా అభ్యాసం చేసిన విద్యార్థులు ఎంతోమంది ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని చెప్పారు. అనంతరం రామకృష్ణ దంపతులను మాజీ ఎమ్మెల్సీ, నర్సీపట్నం కౌన్సిలర్ చింతకాయల రాజేష్, డీసీవో రూపావతి, పీఆర్టీయూ నాయకులు గోపీనాథ్, స్థానిక ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ, జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు.

కనకదుర్గ ఆలయంలో జనసేన ప్రాయశ్చిత్త పూజలు



ఆలయాన్ని శుద్ధి చేస్తున్న జనసేన నాయకులు

నాతవరం, సెప్టెంబరు 25 : తిరుమల లడ్డూ మహాప్రసాదాన్ని వైసీపీ ప్రభుత్వ హయాంలో జంతు అవశేషాలను కలపడాన్ని నిరసిస్తూ ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా బుధవారం నాతవరం కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని నర్సీపట్నం నియోజకవర్గ జనసేన నాయకులు రాజాన వీరసూర్యచంద్ర తదితరులు శుద్ధి చేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ తిరుమల ఘటనలో దోషులను శిక్షించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు వెలగల వెంకటరమణ, మండల యూత్ అధ్యక్షుడు బైన మురళి, కుమార్, ఈరుడి బద్రి,లంక సతీశ్, చినరాజు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు

దేవరాపల్లి, సెప్టెంబరు 25 : ఎస్జీఎఫ్ ఆటల పోటీలలో గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 20, 21 తేదీల్లో దేవరాపల్లిలో జరిగిన ఆటల పోటీలలో అండర్ 14 బాలుర విభాగంలో ఖో-ఖో, వాలీబాల్, చదరంగం, యోగా, వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. కబడ్డీలో ద్వితీయ స్థానం పొందారు. సీనియర్ విభాగంలో అండర్- 17 వాలీబాల్‌లో ద్వితీయస్థానం సాధించారు. అథ్లెటిక్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించారని ప్రిన్సిపాల్ డి.జయప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.తరుణేశ్వరరావు, విద్యార్థులను అభినందించారు.

30 లీటర్ల నాటుసారా స్వాధీనం : ఇద్దరిపై కేసు

గొలుగొండ, సెప్టెంబరు 25 : నాటుసారా విక్రయిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. ఈ దాడుల్లో పప్పుశెట్టిపాలెం గ్రామపంచాయతీ శివారు జమ్మదేవిపేట గ్రామ శివారుల్లో అదే గ్రామానికి చెందిన వల్లపు రాజబాబు, గెమ్మెల రామన్నదొరల వద్ద 30 లీటర్లు నాటుసారాతో పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ముసురు.. పల్లపు ప్రాంతాలు జలమయం



రామన్నపాలెంలో కురుస్తున్న వర్షం



గిరిజన ఆశ్రమపాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

నాతవరం, సెప్టెంబరు 25 : మండలంలో బుధవారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై ముసురు కాసింది. నాతవరం, గుమ్మిడిగొండ సరుగుడు, రామన్నపాలెం తదితర గ్రామాల్లో విరివిగా వర్షాలు పడ్డాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు చోట్ల ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో వర్షం నీరు చేరింది. దీంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్ళేటప్పుడు బురదతో ఇబ్బంది పడ్డారు. రామన్నపాలెం పాఠశాల ఆవరణలో భారీగా వర్షం నీరు వచ్చి చేరింది. తారురోడ్లపై వర్షం నీరు అధికంగా చేరడంతో వాహనదారులు, రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడ్డారు. తాండవలో అక్టోబరు 1న నల్లగొండమ్మతల్లి పండగ ఉండడంతో ఉత్సవ కమిటీ సభ్యులు సొంత ఖర్చులతో తాండవ రోడడ్డు గోతులను మూడు రోజుల కిందట మట్టితో పూడ్చారు. బుధవారం దఫదఫాలుగా కురిసిన వర్షానికి గోతులలో వేసిన కొంత మట్టి కొట్టుకుపోయింది. వెదురుపల్లి-గొలుగొండపేట, మన్యపురట్ల-తునిరోడ్డు మాధవనగరం-వల్లంపేట తదితర రోడ్లు బురదమయంగా మారాయి.

ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన

పలు చోట్ల 'పొలం పిలుస్తోంది'



మాడుగుల రూరల్ : రైతులకు సూచనలిస్తున్న వ్యవసాధికారులు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 25 : సమగ్ర సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో భాస్కరరావు పేర్కొన్నారు. బుధవారం వడ్డాదిలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వరి పొలాలను పరిశీలించారు. పలు చీడ, పీడల నివారణకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : మండలంలోని వీరవిల్లి, పోతనపూడి అగ్రహారాల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో వాసుదేవరావు, కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పొలాలకు పరిశీలించారు. రైతులు పంటల సాగుపై అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం, కొండెంపూడిలో వంగ, టమోటా, మిరప నారు కేవలం ఒక రూపాయికి (ఒక నారు మొక్క) అందుబాటులోఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, సౌజన్య, ఏడీ శ్రీదేవి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట : పంటలకు సకాలంలో ఎరువులు వాడాలని వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని కుసర్లపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో ఎరువులను వినియోగిస్తే మేలన్నారు. కార్యక్రమంలో టీడీపీ స్థానిక నాయకులు పెద్దినాయుడు, పచ్చిగోళ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ, గరుగుబిల్లి గ్రామాల్లో బుధవారం ' పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సోమశేఖర్ మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. చెరకు పొలాలను కూడా సందర్శించి రైతులకు సూచనలు అందించారు. చోడవరం షుగర్ ఫ్యాక్టరీ కేన్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ ఎన్వీ రమణ మాట్లాడుతూ చెరకు రకాలను మార్చాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ రాజేష్, తనకాల అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.



కె.కోటపాడు మండలంలో 'పొలం పిలుస్తోంది'

చీడికాడ :మండలంలోని అర్జునగిరి, జి.కొత్తపల్లి గ్రామాల్లో బుధవారం 'పొలం పిలిచింది' నిర్వహించారు. ఎరువుల వాడకంపై రైతులకు వ్యవసాయ అధికారి ఎం.రమాదేవి అవగాహన కల్పించారు. జీవన ఎరువుల వాడకం, కాలిబాటలు వేయడం వలన వచ్చే ఉపయోగాలు వివరించారు. ఈ సమావేశంలో పశువైద్యాధికారి గాయత్రీదేవి, సర్పంచ్‌లు జి.రమాదేవి, కొల్లి సూరినాయుడు, ఎంపీటీసీ పెంటకోట అమ్మతల్లినాయుడు, పంచాయతీ కార్యదర్శి పట్నాల గోపి, టీడీపీ నాయకులు జె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : మండలంలోని కొత్తకోట, కన్నంపేట గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో డి.రూప రైతులకు పంటల సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఎరువుల వాడకం గురించి వివరించారు. ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది సేంద్రియ వ్యవసాయ సాగు విధానంపై వివరించారు. అనంతరం కొత్తకోట పశువైద్యాధికారి జి.బాలతేజ పశువులకు టీకా మందులపై వివరించారు.

ఈ కార్యక్రమంలో నియోజక వర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన కూరుకుపోయిన సిమెంట్ లోడు లారీ

» గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం



రోడ్డు పక్కన బురదలో కూరుకుపోయిన లారీ

రావికమతం, సెప్టెంబరు 25 : రావికమతం-కింతలి మార్గంలో రావికమతం కాటా వద్ద సిమెంట్ లోడుతో లారీ రోడ్డు చివరిలో బురదలో కూరుకుపోయింది. దీంతో ఈ మార్గంలో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రావికమతం బుధవారం ఉదయం వచ్చిన సిమెంట్ లోడ్ లారీ ఇక్కడ ఓ షాపులో సగం సిమెంట్ దింపి, మిగిలిన సగం మాడుగుల మండలం కింతలిలో షాపులో దింపేందుకు బయలు దేరింది. అయితే, రావికమతం కాటా సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో కాస్త రోడ్డు చివరిలో ఉన్న బురదలో లారీ దిగబడిపోయింది. దీంతో రోడ్డు మార్జిన్‌లో ఇటీవలపైపులైన్ ఏర్పాటు చేసి తాత్కాలికంగా పూడ్చారు. దీనికి తోడు మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండంతో భూమి బాగా నానిపోయి ఉంది. ఈ నేపథ్యంలో పైప్‌లైన్ గొయ్యిలో లారీ ముందు చక్రాలు కూరుకుపోయాయి. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానికుల సహకారంతో ఎక్సకవేటర్‌ను రప్పించి కూరుకుపోయిన సిమెంట్ లోడ్డు లారీని చాలాసేపు శ్రమించి పైకి తీశారు.

ఈ లారీ ఇలా గంటల తరబడి దిగబడిపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలు కదలలేని పరిస్థితి ఎదురైంది. దీంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. ఈ మార్గంలో రోడ్లు వెడల్పు చేయాలని అంతా డిమాండ్ చేస్తున్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి

» దళిత సంఘాల డిమాండ్



దేవరాపల్లి, సెప్టెంబరు 25 : అంబేడ్కర్ ఫ్లెక్సీ చింపిన ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, దళిత డాక్టరుపై దాడి చేసిన ఎమ్మెల్యే పంతం నానాజీని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ విగ్రహం ముందు దళిత సంఘాల నాయకులు నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్‌ను అవమానించిన రఘురామకృష్ణంరాజు, దళిత అధికారిపై దుర్భాషలాడిన పంతం నానాజీలపై అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకూడదన్నారు. కార్యక్రమంలో కాటపల్లి అప్పారావు, మాలిబాబు, అప్పారావు, ఎర్నిబాబు, పరవాడ అప్పారావు, పరశురాం పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళి



బుచ్చెయ్యపేట : నివాళి అర్పిస్తున్న బీజేపీ నేతలు



నాతవరం : దీన్‌దయాళ్‌కు బీజేపీ నేతల నివాళి

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 25 : మండలంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. బుచ్చెయ్యపేట,వడ్డాది గ్రామాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సీతావెంకటరమణ, దూది రాజేష్, రామరాజు, సీతా నాగరాజు పాల్గొన్నారు.

కె.కోటపాడు : బీజేపీ మండల అధ్యక్షులు కోటాన ఈశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ భారతీయ జనసంఘ్‌లో చేరి ఎనలేని సేవలు నిర్వహించిన మహోన్నత వ్యక్తి పండిట్ దయాళ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, ఇమంది సన్యాసిరావు, శరగడం సన్యాసిరావు, పైలా అమ్మాజీ, జనపరెడ్డి సూర్యనారాయణ, బండారు సత్యనారాయణపాత్రుడు పాల్గొన్నారు.

మాకవరపాలెం : మండలంలోని రాచపల్లిలో శ్రీపండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు అడిగర్ల రాంబాబు మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త క్రమశిక్షణతో మెలగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నాతవరం : జనసంఘ్ నేత పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకుడు యర్రా సూర్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో ఎల్.విక్రమ్ బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు పేరూరి బుల్లిదొర, కుమార్‌స్వామి, చింతకాయల చిట్టిబాబు గవిరెడ్డి త్రినాథ్, భవానీ బూషీ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందాం

... 5వ పేజీ తరువాయి

మరికొందరు సందేహం వ్యక్తంచేశారు. కర్మాగార యాజమాన్యం ఒంటెత్తు పోకడలు, కార్మికుల్లో కొందరి ప్రవర్తనపై కూడా ప్రజల్లో అపోహలు ఉన్నాయని కొందరు అన్నారు.అందువల్ల పటిష్టమైన యాజమాన్యం ఉండాలని అభిప్రాయపడ్డారు. కేంద్ర పరిధిలో ఉన్న భూములు మొత్తం బదిలీ చేస్తే బ్యాంకులు నుంచి రుణం తీసుకుని కర్మాగారానికి నడుపుకోవచ్చునని సమావేశంలో ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. ఏదోవిధంగా కర్మాగారాన్ని నిలబెట్టుకోవాలని, సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు నివేదిక రూపంలో సమర్పించాలని తీర్మానించారు. చంద్రబాబు ద్వారా కేంద్రంతో చర్చించి ఒక నిర్ణయం తీసుకోవాలని, అందుకు కాలయాపన కాకుండా సత్వరమే చర్యలు ఉండాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ విశాఖపై తనకు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. పాదయాత్ర సమయంలో ఉక్కు కర్మాగారానికి పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చానని గుర్తుచేశారు. విశాఖ ఉక్కుతో ప్రతి తెలుగువాడికి ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, హైదరాబాద్‌లో తమ ఇంటికి విశాఖ ఉక్కు స్టీల్ వాడామన్నారు. కర్మాగారాన్ని వెంటాడుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి కార్మికుల కళ్లల్లో ఆనందం చూడాలనే దృఢ సంకల్పంతో కేంద్రంతో సంప్రతింపులు జరుపుతున్నామని అన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలను చంద్రబాబునాయుడుకు నివేదిస్తామన్నారు. కేంద్రంతో సీఎం చర్చించి ఉక్కు కర్మాగారంపై ఒక నిర్ణయం తీసుకుంటారని లోకేశ్ వెల్లడించారు. రానున్న రోజుల్లో మిగతా సమస్యలపై చర్చించుకుని నిర్ణయాలు తీసుకుందామన్నారు. అందరూ కూర్చుని చర్చించుకుంటే పరిష్కారం కాని సమస్య ఉండదన్నారు. సమావేశంలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయకుమార్, కోండ్రు మురళి, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, టీడీపీ పెందుర్తి, విశాఖ దక్షిణ ఇన్‌చార్జులు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, సెయిల్ డైరెక్టర్, బీజేపీ నాయకుడు కాశీవిశ్వనాథరాజు పాల్గొన్నారు.

పకడ్బందీగా బడి భోజనం

... 5వ పేజీ తరువాయి

పరిశుభ్రంగా ఉంచడంతోపాటు వంట చేసేవారు కూడా పరిశుభ్రత పాటించాలి. మధ్యాహ్నం భోజనం వడ్డించే సమయంలో ఉపాధ్యాయులంతా దగ్గర ఉండి పిల్లలు అన్నం తినే వరకు పర్యవేక్షణ చేయాలని, విద్యార్థులు భోజనం చేయడం పూర్తయిన తర్వాతే టీచర్లు భోజనానికి వెళ్లాలని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అమరావతి నుంచి విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి పలు పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి, మధ్యాహ్న భోజనం గురించి పిల్లలను వాకబు చేస్తున్నారు. మెనూ అమలు తీరు, భోజనం నాణ్యత గురించి అడుగుతున్నారు.

బడి భోజనంపై పర్యవేక్షణ పెంచాం

- ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఈవో

మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్న ది. ఎక్కడా చిన్న పొరపాటుకి కూడా తావులేకుండా ఉండాలని వీడియో కాన్ఫరెన్సుల ద్వారా అధికారులను అప్రమత్తం చేస్తూ పర్యవేక్షణ చేస్తున్నది. దీంతో జిల్లాలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై పర్యవేక్షణ పెంచాం.రుచి, నాణ్యత, శుభ్రత విషయాల్లో రాజీ పడొద్దని ఎంఈవోలకు, హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశాం.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలో వడ్డాది విద్యార్థికి రజతం



జూడోలో రజతం సాధించిన చరణ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 25: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాలుర జూడో విభాగం పోటీల్లో వడ్డాది కేపీడీ జడ్పీ హైస్కూల్ విద్యార్థి సత్తా చాటాడు. తిరుపతిలో ఈ నెల 22, 23 తేదీల్లో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-14 బాలుర విభాగం జూడో పోటీల్లో వడ్డాది స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు పాల్గొన్నారు. 40 కిలోల విభాగంలో స్కూల్‌కి చెందిన గోడ చరణ్ ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకున్నట్టు పీఈటీ నర్సింగరావు తెలిపారు. బుధవారం విద్యార్థి చరణ్‌ను ఇన్‌చార్జ్ హెచ్ఎం వెంకటావు, ఉపాధ్యాయులు ఎన్వీ సత్యనారాయణ, పీఈటీ నర్సింగరావు, స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ కోవెల వెంకటరమణ అభినందించారు.

☛ సంక్షిప్తంగా..

తహసీల్దార్‌గా అంబటి బాధ్యతల స్వీకారం



చోడవరం, సెప్టెంబరు 25 : మండల తహసీల్దార్‌గా అంబటి రామారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. విధుల్లో చేరిన తహసీల్దార్‌ను రెవెన్యూ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కాగా ఇప్పటి వరకూ సచివాలయం స్థాయిలోనే వివిధ హోదాల్లో పని చేసిన రామారావుకు తహసీల్దార్‌గా మాత్రం చోడవరంలో పోస్టింగ్ రావడం విశేషం.విజయనగరం జిల్లాకు చెందిన తహసీల్దార్ రామారావు తిరుమలబాబు స్థానంలో తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఎంపీడీవోగా సువర్ణరాజు



దేవరాపల్లి, సెప్టెంబరు 25 : దేవరాపల్లి ఎంపీడీవోగా ఎంవీ సువర్ణరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బుచ్చయ్యపేట నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గొలుగొండ, కోటవురట్ల మండలాల్లో పనిచేశారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఇప్పటి వరకు చంద్రశేఖర్ బాధ్యతలు నిర్వహించారు.

అదనపు ఎస్ఐగా భాస్కరరావు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 25 : బుచ్చెయ్యపేట పోలీసు స్టేషన్ అదనపు ఎస్ఐగా భాస్కరరావు పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈయన పార్వతీపురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో భాస్కరరావు ఏఎస్ఐగా పనిచేశారు. భాస్కరరావుకు స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

రేపటి నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు

మాడుగుల, సెప్టెంబరు 25 : మండల కేంద్రంలో శుక్రవారం నుంచి దేవీనవరాత్రి పనులు ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ తెలిపింది. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం 9 గంటలకు దేవీ ఆలయం వద్ద ఉత్సవరాట వేయడం, అనంతరం పందిరి వేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేశారు.

ఆక్రమణల తొలగింపు



దుకాణదారులతో మాట్లాడుతున్న అధికారులు, పోలీసులు

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 25 : మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో శారదానగర్‌లో ఆక్రమణలు తొలగించారు. బుధవారం శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి గుడి దగ్గర నుంచి పోస్టాఫీసు వరకూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని దుకాణదారులకు చెప్పారు. బస్టాండ్ ఇన్ గేట్ దగ్గర ఉన్న గుంతలు మట్టితో పూడ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గోవాడ షుగర్స్‌పై ఎంపీ రమేశ్ హామీ నిలుపుకోవాలి : సీపీఐ



అప్పలరాజు

చోడవరం, సెప్టెంబరు 25 : గోవాడ షుగర్స్ ఆధునీకరణతో పాటు, చెరకు రైతుల కార్మికుల బకాయిలపై అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధికి ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు రైతులు, కార్మికుల బకాయిల చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీ ప్రకటించారని, దీనిపై ఇప్పటి వరకూ ఎలాంటి స్పందన లేకపోవడం శోచనీయమన్నారు. చెరకు రైతుల బకాయిలపై ఇప్పటి వరకూ నాయకులు మాట్లాడకపోవడం సిగ్గుచేటు అని, ఎంపీ దీనిపై నోరు మెదపకపోవడం సరికాదన్నారు.

కార్టూన్ పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు సత్యనారాయణ, వరహాలబాబు

నాతవరం, సెప్టెంబరు 25 : చంటిబాబు మాస్టారు వేసే ఏసీబీ కార్టూన్లు పెద్దలు, పిన్నలకు మానసిక ప్రశాంతతతో పాటు ఆలోచింపజేస్తాయని ఎంఈవో సత్యనారాయణ పేర్కొన్నారు.బుధవారం నాతవరంలో మండల ఉపాధ్యాయుల సమక్షంలో చంటిబాబు మాస్టారు వేసిన ఏసీబీ కార్టూన్ పుస్తకాన్ని ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబుతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎస్.జగన్నాథరావు పాల్గొన్నారు.

సీనియర్ ఫార్మాసిస్ట్‌కు సన్మానం



మాడుగుల, సెప్టెంబరు 25 : ప్రపంచ ఫార్మ సిస్టల దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం మాడుగులలో 1965లో మందుల షాపు ఏర్పాటు చేసిన సీనియర్ ఫార్మసిస్ట్ పుట్టా వీర్రాజుకు మాడుగులకు చెందిన మెడికల్ షాప్‌ల యజమానులు సన్మానించారు. శ్రీరామ మెడికల్స్ యజమాని గౌరీపట్టపు నగేష్ కుమార్, శ్రీగణేష్ మెడికల్స్ యజమాని బత్తుల మూర్తి, మోద సప్తగిరి మెడికల్స్ యజమాని పి.ఈశ్వ రరావు, లక్ష్మిసోమనాథ్ మెడికల్స్, సెయింట్ ఆన్స్ మెడి కల్స్ వీరి ఆధ్వర్యంలో 65 సంవత్సరాలుగా మెడికల్ షాపు నిర్వహిస్తున్న సీనియర్ ఫార్మసిస్ట్ పుట్టా వీర్రాజుకు మెడికల్‌షాపు యజమానులు ఘనంగా పూలమాలలు వేసి శాలువతో సత్కరించారు.